

24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

స్పీకర్ అప్పావు ప్రకటన

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. ఈ యేడాదికి సంబంధించి తొలి శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 12న గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. డీఎంకే ప్రభుత్వం రూపొందించిన ప్రసంగ పాఠంలోని పలు అంశాలను తాను విబేధిస్తున్నానంటూ గవర్నర్ రెండు నిమిషాల్లో కొన్ని వాక్యాలను చదివి ఊరుకున్నారు. తన ప్రసంగం ముందు సభలో జాతీయ గీతాన్ని ఆలాపించాలని ప్రతిపాదించినా పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ తర్వాత స్పీకర్ అప్పావు గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని చదవడానికి ముందు తమిళ శాసనసభ చరిత్రలో గవర్నర్ ప్రసంగం పూర్తయిన తర్వాతే జాతీయ గీతం వినిపించడం ఆనవాయితీగా వస్తోందని, కనుక గవర్నర్ ప్రసంగం ముందు జాతీయ గీతం వినిపించడం కుదరదని తెలిపారు. ఆ తరువాత గవర్నర్ ప్రసంగం తమిళ అనువాదాన్ని స్పీకర్ చదివారు. మరుసటి రోజు నుండి గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చలు కొనసాగాయి. అనంతరం వార్షిక బడ్జెట్, వ్యవసాయ శాఖ బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. ఆ ప్రతిపాదనలపై సభలో చర్చ జరిగిన తరువాతే వాటికి సభ ఆమోదం తెలిపన తరువాత సభ నిరవధికంగా వాయిదాపడింది. ఈ



నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో అధికార పక్షం డీఎంకే కూటమి పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాలు గెలుచుకున్న నేపథ్యంలో శాసనసభ సమావేశాలు ఈ నెల 24న ప్రారంభమవుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. అదే రోజు సభా వ్యవహార మండలి సమావేశమై శాసనసభ సమావేశాలను ఎన్ని రోజులపాటు నిర్వహించాలనే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ఈ సమావేశాల్లో వార్షిక బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టలేకపోయిన కొన్ని ఆర్థిక పద్దులను ప్రవేశపెట్టేందుకు అనుమతిస్తాననని ఆయన తెలిపారు. ఇక ఈ సమావేశాల్లో రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు గురించి, మాదక ద్రవ్యాల అక్రమరవాణా, తాగునీటి సమస్య తదితర కీలకమైన అంశాలపై ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే పాలకపక్షంపై విరుచుకుపడనుంది. దీంతో సభలో చర్చలు వాడి వేడిగా జరిగే అవకాశాలున్నాయి.

నీట్ రద్దుకు ఉమ్మడి పోరాటం

● సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి నీట్ నుంచి మినహాయింపు పొందడం లేదా ఆ ఆ పరీక్షలను శాశ్వతంగా రద్దు చేసేందుకు అన్ని పార్టీలు సమష్టిగా ఉద్యమించాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ యేడాది నీట్ నిర్వహణలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, పలు చోట్ల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని వస్తున్న వార్తలు నీట్‌కు వ్యతిరేకంగా తాము జరుపుతున్న ఆందోళనకు ఊతమిచ్చేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పోస్టు చేశారు. ప్రశ్నపత్రాల లీక్, కొన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షల రాసినవారికి నూటికి నూరు మార్కులు రావడం ఇలా నీట్ పరీక్షల నిర్వహణలో ఉన్న లోసుగులను బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీట్‌ను సమర్థవంతంగా నిర్వహించలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు తాజా సంఘటనలు రుజువుపరస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో నీట్ రద్దు అన్ని పార్టీలు సమష్టిగా ఉద్యమం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని స్టాలిన్ పేర్కొన్నారు.



లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధించడంపై చెన్నైలోని క్యాంపు కార్యాలయంలో స్టాలిన్‌ను సత్కరిస్తున్న దురైమురుగన్, టీఆర్ బాలు, మంత్రులు

'నీట్' రద్దయ్యే వరకు విశ్రమించం

● మంత్రి ఉదయనిధి

పెరంబూర్, జూన్ 7: నీట్ పరీక్ష రద్దయ్యే వరకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం విశ్రమించదని మంత్రి ఉదయనిధి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... సామాజిక న్యాయానికి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర హక్కులకు విరుద్ధంగా నీట్ ఉందన్నారు. నీట్ పరీక్షలను శాశ్వతంగా రద్దు చేసేంతవరకూ తమ పార్టీ విశ్రమించదని ఆయన తెలిపారు. సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉన్న నీట్‌ను రద్దు చేసి, గతంలా రాష్ట్రాల్లో మెడికల్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే రాష్ట్ర జాబితాలో విద్యను చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు డీఎంకే ఎంపీల సమావేశం

ఇదిలా ఉండగా డీఎంకే ఎంపీల సమావేశం శనివారం జరుగనుంది. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిల్లోని 40 స్థానాలను డీఎంకే కూటమి కైవసం చేసుకుంది. కొత్తగా ఎన్నికైన ఎంపీలు త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో తేనాంపేటలోని అన్నా అరివాలయంలో డీఎంకే తరఫున కొత్తగా ఎన్నికైన 22 మంది ఎంపీల సమావేశం శనివారం సాయంత్రం జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షత వహించనున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎగ్మూర్ ప్రభుత్వాస్పత్రిలో

కృత్రిమ గర్భధారణ కేంద్రం

ప్యారీస్, జూన్ 7: స్థానిక ఎగ్మూర్‌లోని ప్రభుత్వ తల్లీపిల్లల ఆసుపత్రి ప్రాంగణంలో రూ.7 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రప్రభుత్వ సూచనల మేరకు ఈ ఆస్పత్రిలో ప్రారంభించిన కృత్రిమ గర్భధారణ కేంద్రంలో అన్ని వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. వైద్యపరీక్షల ఫలితాలు స్పష్టంగా ఉండాలన్న దృక్పథంతో ఆధునిక వైద్య పరికరాలు, వసతులను ఈ కేంద్రంలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటించిన మేరకు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉన్న ప్రభుత్వ ప్రసవాస్పత్రుల్లో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఢిల్లీ, చండీఘడ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో మాత్రమే ప్రభుత్వం తరఫున కృత్రిమ గర్భధారణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని



కృత్రిమ గర్భధారణ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే పరంధామన్ తదితరులు

అయితే, ఈ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు ఫీజు వసూలుచేస్తున్నారని, అలాకాకుండా తమిళనాడులో మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రి వివరించారు. ఇప్పటికే ఈ ఆసుపత్రిలో రూ.89 లక్షలతో ఆధునిక ప్రసవ వార్డు ఏర్పాటుచేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ, జాతీయ ఆరోగ్యశాఖ డైరెక్టర్ శిల్పా ప్రభాకర్ సతీష్, ఎమ్మెల్యే ఇ.పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నామలైకి మంత్రి పదవి?



చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంక్ పెంచిన ఉత్సాహంతో ఢిల్లీ వెళ్ళిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర మంత్రివర్గంలో చోటు సంపాదించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకులతో ఆయన మంతనాలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘోర పరాజయాన్ని చవిచూసినా ఓటు బ్యాంక్ పెరిగి పార్టీ ప్రతిష్ఠ ఉన్నతస్థితికి చేరిందని అన్నామలై చెబుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసినవారికి మంత్రి పదవులు, గవర్నర్ పదవులు ఇచ్చినట్లే ఈసారి పార్టీ అధిష్ఠానం తనకు తప్పకుండా మంత్రి పదవి కట్టబెడుతుందని ఆశపడుతున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన ఇలా గణేషన్, సీపీ రాధాకృష్ణన్, తమిళిసైలను గవర్నర్లుగా నియమించిందని, తనకు ముందు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఎల్.మురుగన్‌కు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించారని, ఆ వరుసలోనే తనకు కూడా కేంద్ర మంత్రిపదవి తప్పకుండా లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను పార్టీ పగ్గాలు స్వీకరించినప్పటి నుండే పార్టీ ప్రతిష్ఠ క్రమంగా పెరుగుతూ వచ్చిందని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటు బ్యాంక్ 11.5 శాతానికి పెరిగిందని ఆయన చెబుతున్నారు. అన్నామలై ఇమేజ్ వల్ల పార్టీకి ఓటు బ్యాంక్ పెరుగలేదని, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యక్తిగత కీర్తిని చూసే ఓటర్లు ఓటువేశారని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ తనకు కేంద్ర మంత్రి వర్గంలో తప్పకుండా స్థానం లభిస్తుందని అన్నామలై ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థుల వివరాలన్నీ మోదీ వద్ద ఉన్నాయని, వాటిని పరిశీలించినమీదటే ఎవరికి ఏ మంత్రిత్వ శాఖను కేటాయించాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటారని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ అన్నామలై ఢిల్లీ తిష్టవేసి మంత్రి పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో ఒకటి రెండు రోజుల తర్వాతే తెలుస్తుంది.

గోడౌన్లకు ఈవీఎంల తరలింపు

● ఎస్ఈసీ సత్యప్రదసాహు

పెరంబూర్, జూన్ 7: లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను ఎన్నికల సంఘం గోదాములకు తరలించి భద్రపరిచారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు గురువారం మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను మరుసటిరోజు విద్యాసంస్థల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఫలితాలు విడుదలైన తరుణంలో, ఈవీఎంలను సత్వరం ఎన్నికల సంఘం గోదాములకు తరలించామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలుంచేలా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 32 జిల్లాల్లో గోదాములు ఏర్పాటుచేశామని, మిగిలిన ఏడు జిల్లాల్లో గోదాములు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు (ఫైల్ ఫొటో)

కేసు నమోదుకు అవకాశం...

ఎన్నికల ఫలితాల్లో సందేహాలుంటే హైకోర్టులో పిటిషన్ వేసుకోవచ్చని తెలిపారు. అందుకు ఎన్నికల ఫలితం వెలువడిన తర్వాత 45 రోజుల వరకు అవకాశం ఉంటుందన్నారు. ఆలోగా రాజకీయపార్టీలు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసుకోవచ్చని తెలిపారు. హైకోర్టులో ఆ కేసులు విచారణకు వచ్చినప్పుడు, సంబంధిత నియోజకవర్గ ఈవీఎంలు సహా ఎన్నికల్లో వినియోగించిన అన్ని పరికరాలు భద్రపరచాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఇకపై ఫలితాలపై అసంతృప్తి ఉంటే న్యాయస్థానాలను మాత్రమే ఆశ్రయించాలని తెలిపారు. అలాగే, ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేది నుంచి 30 రోజుల్లో ఎన్నికల ఖర్చు దాఖలుచేయాలన్నారు. ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న నగదు సహా ఇతర వస్తువులకు సంబంధించి తగిన ఆధారాలు చూపిస్తే వాటిని అప్పగిస్తున్నామని తెలిపారు.

సవరణకు దరఖాస్తుల స్వీకరణ

ఎన్నికలు జరిగే సమయంలో పలువురు ఓటర్ల జాబితా చేర్చాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి జాబితాలో చేర్చనున్నామన్నారు. అలాగే, పేర్లు చేర్చడం, తొలగించడం, చిరునామా మార్పు, సవరణ తదితరాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించారనే వ్యవహారంలో, అభ్యర్థులు, పార్టీ తరఫున ఫిర్యాదు చేస్తే అందుకు సంబంధించి విచారణ చేపట్టాలని సంబంధిత ఎన్నికల సంఘ కార్యాలయానికి సర్క్యులర్ పంపుతామని సత్యప్రదసాహు తెలిపారు.

13 వరకు తేలికపాటి వర్షాలు

నేటినుంచి పెరగనున్న ఉష్ణోగ్రత

అడయార్, జూన్ 7: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 13 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు.. దక్షిణ భారతంపై బాహ్య ఉపరితల ద్రోణి ఆవహించివుందని, ఈ కారణంగా శనివారం నుంచి రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం పడుతుందన్నారు. ముఖ్యంగా నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూర్, ఈరోడ్, ధర్మపురి, కృష్ణగిరి, తిరుపత్తూరు, విల్లుపురం, కడలూరు, తిరుచ్చి, అరియలూరు పెరంబలూరు, కరూర్, దిండిగల్, తేని, పుదుచ్చేరి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 13 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేసమయంలో రానున్న మూడు నుంచి ఐదు రోజుల్లో రాష్ట్రంతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతల్లో పెనుమార్పులు వచ్చే అవకాశం ఉందన్నారు.. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాలలో 2 నుంచి 3 డిగ్రీల మేరకు పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందన్నారు.. చెన్నై నగరంలో మాత్రం రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి, మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24 నుంచి 25 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. తీర ప్రాంతాల్లో గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, అపుడపుడు గంటకు 55 కిమీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. అలాగే, కావేరీ డెల్టా ప్రాంతాల్లో ప్రతి రోజూ రాత్రి నుంచి ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది. నాగపట్టణం, తిరుచ్చి, తంజావూరు, అరియలూరు తదితర జిల్లా ఈ వర్షం ఎక్కువగా పడుతుంది. ఈ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. మరోవైపు, తంజావూరు జిల్లా ఒరత్తనాడు సమీపంలోని కక్కరకోట నత్తం సమీపంలో పిడుగుపాటుకు కలైసెల్వం అనే వ్యక్తి భార్య సరిత (50) ప్రాణాలు కోల్పోయింది.

11న టీఎన్‌సీసీ సర్వసభ్య భేటీ

● పార్టీ బలోపేతంపై దృష్టి

అడయార్, జూన్ 7: ఈ నెల 11వ తేదీన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాఖ (టీఎన్‌సీసీ) సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఇందులో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించనున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే భాగస్వామ్య పార్టీగా బరిలోకి దిగిన కాంగ్రెస్.. ఆ పార్టీ పోటీ చేసిన తొమ్మిది స్థానాల్లో గెలుచుకుంది. గెలుపొందిన అభ్యర్థుల్లో తిరువళ్ళూరు లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగిన శశికాంత్ సెంథిల్ అత్యధిక ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన ఆ పార్టీ కార్యవర్గ, సర్వసభ్య సమావేశం జరుగనుంది. స్థానిక తేనాంపేటలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో ఈ భేటీ జరుగనుంది. ఈ సమావేశానికి టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై అధ్యక్షత వహించనున్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అజయ్ కుమార్, ఏఐసీసీ కార్యదర్శి శ్రీవల్ల ప్రసాద్‌లు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనున్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో కొత్తగా ఎంపికైన తొమ్మిదిమంది ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులతో పాటు 711 మంది సభ్యులు హాజరుకానున్నారు. ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గణనీయమైన ఓట్లను సాధించింది. భవిష్యత్‌లో ఆ పార్టీ వృద్ధిని ఎలా అడ్డుకోవాలన్న అంశంపై చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అదేవిధంగా టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా పెరుందగై అనేక చర్యలను చేపట్టాలని భావిస్తున్నారు. ఈ యాక్షన్ ప్లాన్ కూడా ఈ సమావేశంలో వెల్లడించే అవకాశం ఉంది. దీంతో ఈ సర్వసభ్య, కార్యవర్గ సమావేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

ఇంజనీరింగ్ కోర్సులకు 2.49 లక్షల దరఖాస్తులు

● ఆగస్టు మొదటి వారం నుంచి కౌన్సెలింగ్

పెరంబూర్, జూన్ 7: ఇంజనీరింగ్ కోర్సులకు ఈ ఏడాది 2.49 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు సమర్పించారు. వారిలో 1.78 లక్షల మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారు. ఈ కోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఏడాది ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రభుత్వ కోటా సీట్లలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ మే 6వ తేది ప్రారంభమైంది. తొలిరోజు నుంచే విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తులు సమర్పించారు. ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గురువారం (ఈ నెల 6వ తేది)తో ముగిసింది. ఈ నేపథ్యంలో, ఆన్‌లైన్‌లో పొందిన దరఖాస్తుల వివరాలను తమిళనాడు ఇంజనీరింగ్ విద్యార్థులు అడ్మిషన్ సెక్రటరీ పురుషోత్తమన్ శుక్రవారం విడుదల చేశారు. ఆ ప్రకారం, ఈ ఏడాది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2,49,918 మది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,06,012 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 1,78,180 మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 12వ తేది వరకు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించారు. గత ఏడాది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2,29,175 మంది దరఖాస్తు చేసుకోగా, చివరగా సర్టిఫికెట్లు అప్‌లోడ్, దరఖాస్తు రుసుమును చెల్లించిన వారు 1,87,847 మంది ఉన్నారు. గత ఏడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో, దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ర్యాండమ్ నెంబర్లు ఈ నెల 12న కేటాయించి, జూలై 10వ తేది ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నారు. విద్యార్థులు కళాశాల ఎంపిక చేసుకొనేలా ఆన్‌లైన్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో నిర్వహించాలని సాంకేతిక విద్యా డైరెక్టరేట్ నిర్ణయించింది.

తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌లో

11 నుంచి కొత్త టెర్మినల్ సేవలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ సేవలు ఈ నెల 11 నుంచి అందుబాటులోకి వస్తాయని విమానాశ్రయ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ టెర్మినల్‌ను ప్రధాని నరేంద్రమోదీ జనవరి 2న ప్రారంభించారు. అప్పట్లో తొంభై శాతం పనులు మాత్రమే పూర్తికావటంతో పది శాతం పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవలే పనులన్నీ పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్త టెర్మినల్ సేవలు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. గత వారం విమానాశ్రయం డైరెక్టర్ సుబ్రమణి నాయకత్వంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఈ నెల 11 నుంచి కొత్త టెర్మినల్ సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఆ మేరకు అధికారులు కొత్త టెర్మినల్‌కు మరింత మెరుగులు తీర్చిదిద్దే పనులు ప్రారంభించారు. ఈ నెల 11 ఉదయం ఆరుగంటలకు ఈ కొత్త టెర్మినల్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అగ్నిమాపక అధికారులు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం అధికారులు కొత్త టెర్మినల్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సమాచార ధ్వని

బీఎస్సీ, బీసీఏ విద్యార్థులకు వృత్తి శిక్షణ

ఐసీఎఫ్, జూన్ 7: బీఎస్సీ, బీసీఏ విద్యార్థులకు వృత్తి ప్రతిభా శిక్షణ ఇవ్వనున్నట్లు చెన్నై ఐఐటీ తెలిపింది. ఐఐటీ, పరివర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ పట్టభద్రులైన యువత ఉద్యోగావకాశాలు పొందేలా సాంకేతిక ప్రతిభాభివృద్ధి శిక్షణ ఇస్తోంది. ఈ క్రమంలో, బీఎస్సీ, బీసీఏ పూర్తిచేసిన విద్యార్థులకు నెట్ వర్కింగ్ ఎషన్షియల్స్, క్లౌడ్ ఫండమెంటల్స్ టిక్కెటింగ్ పరికరాలు వంటి వివిధ శిక్షణలు జూలై మొదటి వారంలో ఇవ్వనుంది. తొలివిడతగా కరూర్, కోయంబత్తూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు చెన్నై ఐఐటీ తెలిపింది. ఔత్సాహికులు https://forms.gle/7RhAKgrGRgwr17zd6 అనే వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని పేర్కొంది.

ఇంజనీరింగ్ విద్యార్థులకు స్టార్టప్ శిక్షణ

ఐసీఎఫ్, జూన్ 7: ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్టార్టప్ ప్రారంభించేందుకు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ వంటి సాంకేతిక కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాలను వెతుక్కోవడం కంటే తమ స్వీయ అభిప్రాయాలతో స్టార్టప్‌తో కొత్త వృత్తి సంస్థలు రూపొందించేందుకు కేంద్రప్రభుత్వం వివిధ సహాయాలు అందిస్తుంది. రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్టార్టప్ ప్రారంభించేందుకు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ నెల 10వ తేదిలోగా https://bit.ly/ అనే వెబ్‌సైట్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అలాగే 17వ తేది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ జరుగుతుందని వర్శిటీ ప్రకటించింది.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జూన్ 7: 'నాన్ ముదల్‌వన్' పథకంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే రాతపరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... రైల్వే, బ్యాంక్ సహా పలు కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పోటీ పరీక్ష నిర్వహిస్తుంటారు. ఈ పరీక్షల్లో విద్యార్థులకు 'నాన్ ముదల్‌వన్' పథకంలో ఆన్‌లైన్‌లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదిలోపు https://www.naanmud-halvan.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది.

250 కి.మీ వేగంతో నడిచే రైళ్లు

ఐసీఎఫ్, జూన్ 7: చెన్నై ఐసీఎఫ్ 250 కి.మీ వేగంతో నడిచే రెండు రైళ్లను తయారుచేయనుంది. స్థానిక పెరంబూర్‌లో ఉన్న రైలుపెట్టెల తయారీ కర్మాగారమైన ఐసీఎఫ్ వందే భారత్ రైళ్ల సహా వివిధ రైలు పెట్టెలు తయారుచేస్తోంది. 2024-25లో అతివేగంగా నడిచే (గంటకు 250 కి.మీ) రైళ్ల తయారుచేయనుంది. ఈ రైళ్ల 8 బోగీలతో ఉంటాయని, అతివేగంతో నడిచే రైళ్ల తయారీ చేపట్టడం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు.

త్వరలో యు ఆకారపు ఫ్లై ఓవర్ ప్రారంభం

ఐసీఎఫ్, జూన్ 7: స్థానిక టైడల్ పార్క్ ప్రాంతంలో రూ.108 కోట్లతో నిర్మిస్తున్న 'యు' ఆకారం కలిగిన ఫ్లై ఓవర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రాజీవ్ గాంధీ రోడ్డు, ఈసీఆర్ రోడ్డును అనుసంధానం చేస్తూ ఇందిరా నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో యు ఆకారంతో ఫ్లై ఓవర్ నిర్మాణపనులు 2019 జూలైలో ప్రారంభమయ్యాయి. గత ఏడాది నవంబరులో అందుబాటులోకి రావాల్సిన ఈ ఫ్లై ఓవర్, నిర్మాణపనులు జాప్యం కావడంతో ఆగస్టుల నెలాఖరులోగా పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

యూనిఫాం ఉంటే చాలు..

ఐసీఎఫ్, జూన్ 7: యూనిఫాంలో ఉన్న విద్యార్థులు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చని చెన్నై మెట్రోపాలిటన్ రవాణా సంస్థ (ఎంటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఈ నెల 10వ తేది పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ విద్యా సంవత్సరం ఉచిత బస్‌పాస్‌ల మంజూరులో జాప్యం జరుగనుండడంతో అప్పటివరకు విద్యార్థులు పాత బస్‌పాస్, యూనిఫాం ధరించి ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అలాగే, బస్టాప్‌లలో విద్యార్థులను భద్రంగా ఎక్కించుకెళ్లాలని డ్రైవర్, కండక్టర్లకు సూచించారు.

లా కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

ఐసీఎఫ్, జూన్ 7: లా కోర్సుల కౌన్సెలింగ్ ర్యాంకుల జాబితా, కటాఫ్ మార్కులు విడుదలయ్యాయి. తమిళనాడు డాక్టర్ అంబేడ్కర్ న్యాయ విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో పనిచేసే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో చేరేందుకు 7,012 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 ప్రభుత్వ లా కళాశాలలు, 8 ప్రైవేటు కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో 2,043 సీట్లకు 16,984 మంది దరఖాస్తు చేసుకున్నారు. లా వర్సిటీ క్యాంపస్‌లోని లా స్కూల్‌లో 624 సీట్లకు 7,042 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి ప్లస్ టూ మార్కుల ఆధారంగా ర్యాంకుల జాబితా, కటాఫ్ మార్కుల వివరాలు విశ్వవిద్యాలయం ప్రకటించింది. జాబితాలో ఉన్న వారికి శనివారం నుంచి 12వ తేది వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుంది. 15వ తేది ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగనున్నాయి. 18వ తేది నుంచి 20వ తేదిలోపు విద్యార్థులు కళాశాలల్లో చేరాలి.

బీమా నెంబరు నమోదు తప్పనిసరి

ఐసీఎఫ్, జూన్ 7: ఆస్పత్రులకు చికిత్స కోసం వచ్చే రోగుల బీమా వివరాలను నమోదు చేయాలని జాతీయ వైద్య కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు కమిషన్ సమాచార సాంకేతిక కార్యదర్శి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో... ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఇటీవల అధికారులు సమావేశమై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఆసుపత్రుల్లో ఉన్న రోగులు, ఔట్ పేషంట్లుగా చికిత్స పొందే వారికి ఆసుపత్రిలో అందజేసే రిజిస్టర్ నెంబరుతో కలిపి ఆయుష్మాన్ భారత్ వైద్య బీమా గుర్తింపు నెంబరును నమోదుచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.

ఐటీఐ విద్యార్థుల అడ్మిషన్ గడువు పొడిగింపు

ఐసీఎఫ్, జూన్ 7: ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 13వ తేది వరకు గడువు పొడిగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 102 ప్రభుత్వ, 305 ప్రైవేటు ఐటీఐలు పనిచేస్తున్నాయి. వీటిలో శిక్షణ పొందేందుకు 8వ తరగతి, టెన్త్ ఉత్తీర్ణులైన వారి నుంచి మే 10వ తేది నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. శుక్రవారంతో ముగిసిన ఈ గడువు 13వ తేది వరకు పొడిగించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 136 సహాయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 9499055689 నెంబరు సంప్రదించాలని అధికారులు తెలిపారు.

మూడో విడత 'ఆరుపడైవీడు' ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభం

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం తిరుచెందూరులో శుక్రవారం ఉదయం మూడో విడత 'ఆరుపడైవీడు' ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభమైంది. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో తమిళుల ఆరాధ్య దైవమైన సుబ్రహ్మణ్యస్వామివారు కొలువైన ఆరు దివ్యక్షేత్రాలకు 60 నుండి 70 యేళ్లలోపు వృద్ధులతో 'ఆరుపడైవీడు' ఆధ్యాత్మిక యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ పథకం కింద ఆరు ఆలయాలకు ఉచిత బస, భోజన సదుపాయంతో వృద్ధులను బస్సుల్లో తీసుకెళ్ళి దైవదర్శనం కల్పిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో మూడో విడత అరుపడైవీడు ఆధ్యాత్మిక యాత్ర శుక్రవారం ఉదయం తిరుచెందూరు ఆలయం వద్ద ప్రారంభమైంది. ఈ యాత్రలో మదురై, శివగంగ, తిరునల్వేలి, తూత్తుకుడి జోన్లకు చెందిన 202 మంది భక్తులు, దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు 40 మంది ఐదు బస్సుల్లో ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. ఈ యాత్రకు ఎంపికైన భక్తులందరూ గురువారం సాయంత్రం తిరుచెందూరు చేరుకున్నారు. ఆలయంలో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులను దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత అందరికీ స్వామివారి దర్శనం కల్పించారు. ఆ తర్వాత షణ్ముగవిలాస్ మండపంలో ప్రసాదం అందజేశారు. రాత్రి భక్తులందరూ ఆ ప్రాంతంలోనే బసచేశారు. శుక్రవారం ఉదయం భక్తులందరూ సముద్రతీరంలో స్నానమాచరించి తీర్థయాత్రకు సిద్ధమయ్యారు. ఆ తర్వాత తాలూకా కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి ఐదు బస్సుల్లో ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. ఈ యాత్రను తిరుచెందూరు పురపాలక సంఘం అధ్యక్షురాలు శివ ఆనంది, ఉపాధ్యక్షులు సెంగుళి రమేష్, ఆలయ ట్రస్టీలు గణేషన్, సెంధిల్ మురుగన్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్తీక్, జిల్లా ట్రస్టీ వాల్‌సుడలై, కౌన్సిలర్లు అంటోని రూమన్, సుధాకర్, సోమసుందరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న తిరుచెందూరు మున్సిపల్ అధ్యక్షురాలు శివ ఆనంది తదితరులు

అన్నామలై ఓటమిని సెలబ్రేట్ చేసుకున్న ఎస్వీ శేఖర్

అడయార్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఓటమిని ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు సెలబ్రేట్ చేసుకుంటున్నారు. వారిలో సినీ నటుడు ఎస్వీ శేఖర్‌బాబు ఒకరు. ఈయన అన్నామలై ఓటమిని తన ఇంటి ముందు టపాసులు పేల్చి మరీ సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, అన్నామలై తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అప్పటి వరకున్న ఆ పార్టీ సీనియర్ నేతలందరినీ పక్కన బెట్టేశారు. ఈ వైఖరిని చాలా మంది నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే అన్నామలై ఓటమి వారికి ఒక సంబరంలా ఉందని పలువురు బీజేపీ నేతలు అంటున్నారు.

కొడనాడు ఎస్టేట్ తనిఖీకి సర్పంచ్‌కు అనుమతి

పెరంబూర్, జూన్ 7: శశికళకు సొంతమైన కొడనాడు ఎస్టేట్ తనిఖీకి పంచాయతీ సర్పంచ్‌కు మద్రాసు హైకోర్టు అనుమతిచ్చింది. శశికళకు సొంతమైన కొడనాడు ఎస్టేట్‌లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో వాటికి పన్ను వేయాలని, నిబంధనలు అతిక్రమించి నిర్మించిన భవనాలు కూల్చివేసేందుకు అనుమతించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో కొడనాడు పంచాయతీ సర్పంచ్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన హైకోర్టు, కొడనాడు ఎస్టేట్ తనిఖీకి కొడనాడు పంచాయతి సర్పంచ్‌కు అనుమతులు జారీచేసింది. తనిఖీల సమయంలో తటస్థంగా ఉండాలని, ఎవరికి ఇబ్బందులు పెట్టరాదని హైకోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించింది.

420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసీఎఫ్, జూన్ 7: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 420 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అత్తిపట్టులో ఉన్న ఈ విద్యుత్ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. మొదటి, మూడవ యూనిట్లలో బాయిలర్ ట్యూబ్ పంచర్ కావడంతో గురువారం విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది.

ఆలయ కళాశాలల్లో చదివిన వారికి ఉద్యోగాలు

ఐసీఎఫ్, జూన్ 7: ఆలయాల ఆధ్వర్యంలో నిర్వహించే కళాశాలల్లో చదివిన 1,894 మంది విద్యార్థులు కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలు పొందారు. ఆలయాల ఆధ్వర్యంలో ఒక సాంకేతిక కళాశాల సహా 10 కళాశాలలున్నాయి. వీటిలో ఫైనలియర్ చదివిన విద్యార్థుల కోసం 51 సంస్థల ద్వారా ఇంటర్వ్యూలు జరిగాయి. కుట్రాలం పరాశక్తి మహిళా కళాశాలలో 641 మంది, పళని ఆండవర్ మహిళా ఆర్ట్స్ కళాశాలలో 556 మంది, పాలిటెక్నిక్‌లో 197 మంది, చెన్నై కొళత్తూర్ కపాలీశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 141 మంది, తూత్తుకుడి జిల్లా విలాత్తికుళం సుబ్రమణ్యస్వామి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 111 మంది ఎంపికై ఉద్యోగ నియామక ఉత్తర్వులు పొందారు.

రెఫెక్స్ ఈవీల్జ్ ఎలక్ట్రిక్ టాక్సీ సేవలు ప్రారంభం

అడయార్, జూన్ 7: రెఫెక్స్ ఈవీల్జ్ ఎలక్ట్రిక్ ఎయిర్‌పోర్టు ట్యాక్సీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. తొలుత బెంగళూరు నుంచి ప్రారంభించారు. రెఫెక్స్ ఈవీల్జ్ నుంచి ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ ఫ్లీట్) 175 కాంపాక్ట్ ఎస్‌యూవీలను కలిగివుంది. ఈ ట్యాక్సీ సేవలను బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో హరి మరార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెఫెక్స్ గ్రూపు ఎండీ అనిల్ జైన్ మాట్లాడుతూ, రెఫెక్స్ గ్రీన్ మొబిలిటీ వర్టికల్ రెఫెక్స్ ఈవీల్జ్ ప్రయాణానికి ఎంతో సురక్షితమైనదని తెలిపారు. వంద శాతం కంపెనీ యాజమాన్యంతో లీజుకు తీసుకున్న ఈవీ ఫ్లీట్, మా డ్రైవర్ల భాగస్వాములతో ఈ సేవలను విజయవంతంగా అందిస్తామని పేర్కొన్నారు.



టాక్సీ సేవలను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

కూవం నది శుభ్రతకు రూ.50 కోట్లు కేటాయింపు

పెరంబూర్, జూన్ 7: స్థానిక కూవం నదిలో 23 ప్రాంతాల్లో వ్యర్థ జలాలు కలువకుండా చేపట్టనున్న పనులకు రూ.50 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చెన్నై రివర్ ట్రస్ట్ ఫండ్ నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

పెరంబూర్, జూన్ 7: మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మానవాళి శ్రేయస్సుకు చెట్లు ఎంతో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పల్లావరం సమీపం పొలిచ్చనల్లూర్ శివశంకర్ నగర్ పార్క్‌లో పసుమై తాయగం, గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పసుమై తాయగం జిల్లా సహాయ కార్యదర్శి పూక్కడై మునుస్వామి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా పసుమై తాయగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కన్నన్, చెంగల్పట్టు దక్షిణం జిల్లా కార్యదర్శి పమ్మల్ రాహుల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ అన్నామలై, జిల్లా ఉపాధ్యక్షుడు గణపతి, శాఖా కార్యదర్శి మణికంఠన్, నిర్వాహకులు రాజేంద్రన్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



శివశంకర్ నగర్ పార్క్‌లో మొక్కలు నాటుతున్న నిర్వాహకులు

విక్రవాండి నియోజకవర్గానికి త్వరలో ఉప ఎన్నిక

ప్యారీస్, జూన్ 7: రాష్ట్ర అసెంబ్లీలో ఖాళీయైన విక్రవాండి నియోజకవర్గానికి త్వరలోనే ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే పుహళేంది అనారోగ్యంతో ఏప్రిల్ 6న మరణించిన విషయం తెలిసిందే. అందువల్ల ఆ నియోజకవర్గానికి పార్లమెంటు ఎన్నికలతో పాటు ఉప ఎన్నిక జరుగుతుందని అందరూ ఎదురుచూశారు. అయితే ఏడు దశలుగా జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగలేదు. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తర్వాతే విక్రవాండి ఎమ్మెల్యే మృతి చెందారని తెలిపారు. ఒక నియోజకవర్గం ఖాళీ అయిన తర్వాత ఆరు నెలల్లో ఎన్నికలు జరపాల్సి ఉంటుందని, ఆ ప్రకారం ఈ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఆగస్టు వరకు గడువు ఉందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రస్తుతం విక్రవాండి ఉప ఎన్నిక నిర్వహణపై పరిశీలిస్తోందని ఆయన తెలిపారు.

మళ్లీ పోటీచేసిన ఎంపీలకు తగ్గిన ఓటు బ్యాంక్

ప్యారీస్, జూన్ 7: రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మళ్లీ పోటీచేసిన 18 మంది ఎంపీల ఓటు బ్యాంక్ తగ్గింది. ఏప్రిల్ 19న రాష్ట్రంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలు పోటీచేశాయి. ఈ నెల 4న ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో డీఎంకే కూటమి పార్టీలు 39 స్థానాల్లో ఘనవిజయం సాధించాయి. 2019 పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన ఎంపీల్లో పలువురికి ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీచేసే అవకాశం దక్కింది. ఆ విధంగా పోటీచేసిన 18 మంది ఓటు బ్యాంక్ గణనీయంగా పడిపోయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పెరంబలూరు నియోజకవర్గంలో ఐజేకే అధ్యక్షుడు పారివేందర్ డీఎంకే కూటమి తరపున ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీచేసి గెలిచారు. ఆయన అదే నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరపున కమలం గుర్తుపై పోటీచేసి అధిక ఓట్ల మెజార్టీ తేడాలో విజయావకాశాలు కోల్పోయి మూడో స్థానంలో నిలిచారు. డిపాజిట్ కోల్పోయిన ఆయన గత ఎన్నికల్లో కంటే ప్రస్తుతం 47.65 శాతం ఓట్లు తక్కువగా పొందారు. అదే విధంగా మరో నలుగురు ఎంపీలు గతంలో కంటే 7.5 శాతం నుంచి 15.8 శాతం వరకు తక్కువ ఓట్లు రాబట్టుకుని గెలిచారు. దీని ప్రకారం విరుదునగర్ నియోజకవర్గంలో మళ్లీ పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి మాణిక్యం ఠాగూర్‌కు ఈసారి 7.5 శాతం ఓటు బ్యాంక్ తగ్గింది. ఇక, కరూర్ కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతిమణి ఓటు బ్యాంక్ కూడా 15.8 శాతానికి తగ్గింది. శివగంగలో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరానికి 11.5 శాతం, ఉత్తర చెన్నై, విల్లుపురం, నీలగిరి, కాంచీపురం, తిరువణ్ణామలై, అరక్కోణం నియోజకవర్గాల్లో పోటీచేసిన డీఎంకే అభ్యర్థుల ఓటు బ్యాంక్ కూడా తగ్గింది. అయితే కన్నియాకుమారి, తూత్తుకుడి, రామనాధపురం, మదురై, చిదంబరం, సెంట్రల్ చెన్నై నియోజకవర్గాల్లో పోటీచేసిన ఎంపీల ఓటు శాతం గతంలో కంటే ప్రస్తుత ఎన్నికల్లో పెరిగింది.

గున్న ఏనుగుకు శిక్షణ

పెరంబూర్, జూన్ 7: కోయంబత్తూర్ మరుదుమలై అటవీ ప్రాంతంలో వదిలివెళ్లిన తల్లి ఏనుగుతో గున్న ఏనుగును చేర్చేందుకు అటవీ సిబ్బంది శ్రమిస్తున్నారు. అడుక్కల్ ప్రాంతంలో శిబిరం ఏర్పాటు చేసి గున్న ఏనుగును సంరక్షిస్తున్న అటవీ సిబ్బంది, టాప్ స్లిప్ ప్రాంతంలోని ఏనుగుల శిబిరం నుంచి మావటిని రప్పించి గున్న ఏనుగుతో మాట్లాడే ప్రయత్నం చేపట్టారు. అడవిలో తల్లి ఏనుగుతో కలిసేందుకు గున్న ఏనుగు శబ్దం చేయాల్సి ఉందని, అందువల్ల గున్న ఏనుగుకు ఆ శిక్షణ ఇస్తున్నట్లు అటవీ సిబ్బంది తెలిపారు.



గున్న ఏనుగుకు శిక్షణ ఇస్తున్న అటవీ సిబ్బంది

అల్పాహారం తయారీపై శిక్షణ

పెరంబూర్, జూన్ 7: అచ్చిరపాక్కంలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న కేంద్రం నిర్వాహకులకు అల్పాహారం తయారీ శిక్షణ గురువారం ప్రారంభమైంది. చెంగల్పట్టు జిల్లాలోని ఏడు యూనియన్లలో 55 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలు జరుగుతోంది. ఈ పథకంలో ఆహారం తయారు చేసే మహిళలకు వంటలో మెళుకువలు అందించేలా అచ్చిరుపాక్కం ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ లో అల్పాహారం తయారీ విధానం, పాత్రలు శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛమైన కాయగూరలు ఎంపిక సహా పలు విషయాలపై వివరించినట్లు, ఈ తరగతులు శుక్రవారం కూడా కొనసాగాయని అధికారులు తెలిపారు.



అల్పాహారం తయారీలో శిక్షణ ఇస్తున్న అధికారులు

అంబులెన్స్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

ఐసీఎఫ్, జూన్ 7: రాష్ట్రప్రభుత్వ వెటర్నరీ అంబులెన్స్ సేవలకు అసిస్టెంట్లు, డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థ తెలిపింది. ప్రభుత్వ 1962 ఉచిత వెటర్నరీ అంబులెన్స్ సేవలను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఈ సంస్థలో సహాయకులు, డ్రైవర్లు అవసరమవుతున్నారు. సహాయకుల పోస్టులకు ప్లస్ టూ ఉత్తీర్ణులైన వారు, వెటర్నరీ కళాశాలల్లో ఏదైన ఒక శిక్షణ పూర్తిచేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరిని నెలకు వేతనం రూ.17,725 అందజేస్తారు. డ్రైవర్ పోస్టులకు 8వ తరగతి ఉత్తీర్ణతతో పాటు 24 నుంచి 35 ఏళ్లలోపుండి, డ్రైవర్ లైసెన్స్‌తో పాటు బాడ్జ్ లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలి. వీరికి నెలకు రూ.15,820 అందజేస్తారు. ఇతర వివరాలకు 044-28888060, 9150084170 అనే నెంబర్లను సంప్రదించవచ్చు.

సూలేరికాడు కుప్పంలో ఇళ్ల తొలగింపు

● మత్స్యకార కుటుంబీకుల ధర్నా

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపం సూలేరికాడు కుప్పం ప్రాంతంలో దేవాదాయ శాఖ స్థలంలో నిర్మించిన 40 ఇళ్ళను తొలగించేందుకు వెళ్ళిన అధికారులకు స్థానిక మత్స్యకారుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. ఆ ఇళ్ళను ఖాళీ చేసే ప్రసక్తి లేదంటూ కుటుంబీకులు ప్రత్యేకించి మహిళలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సూలేరికాడుకుప్పం వద్ద సుమారు 300లకు పైగా మత్స్యకారుల కుటుంబాలు నివసిస్తున్నారు. అక్కడి తులకానత్తమ్మ ఆలయం వద్ద ఉన్న 40 ఇళ్లు, అక్కాపామ్ స్థలం హిందూ దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న నెమ్మేలి ఆలవందార్ ట్రస్టుకు చెందిన స్థలంలో ఉన్నాయని చెబుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబీకులను ఇళ్లను ఖాళీ చేయమంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే జాలర్లు ఆ ఇళ్ళను ఖాళీ చేసేందుకు అంగీకరించలేదు. ఈ వివాదంపై కోర్టులో కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఇళ్ళను ఖాళీ చేయకుండా మత్స్యకారులు ఆందోళనకు దిగటంతో అధికారులు అక్కడి అక్కాపామ్ స్థలం వద్ద ఆ స్థలం దేవాదాయశాఖకు చెందినదంటూ నోటీసు బోర్డు పెట్టి సీలు పెట్టారు. అదే సమయంలో నలభై ఇళ్లలో తాళం వేసి ఉన్న ఇంటి గోడపై కూడా నోటీసు అతికించారు. అంతటితో ఆగకుండా ఎక్సకవేటర్‌లో ఆ ఇళ్ళను కూల్చివేసేందుకు కూడా సిద్ధమయ్యారు. ఈ సంఘటనతో ఆ 40 ఇళ్లలో నివసిస్తున్నవారంతా ఆగ్రహం చెంది తులకానతమ్మ ఆలయం వద్ద గుమికూడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ళను ఖాళీ చేయబోమంటూ ధర్నాకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని వారితో చర్చలు జరిపారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటంతో పోలీసు బలగాలను మొహరించారు. మహాబలిపురం డీఎస్పీ రవి అబ్రహామ్ నాయకత్వంలో ఆ ప్రాంతంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.




ఎక్సకవేటర్‌ను అడ్డుకుని ధర్నా చేస్తున్న మహిళలు - గుమికూడిన పోలీసులు

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే నిజమైన గెలుపు

● మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం



మాట్లాడుతున్న చిదంబరం

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నిజమైన గెలుపు కాంగ్రెస్ పార్టీకే చెందుతుందని, మూడోసారి నాలుగువందలకు పైగా సీట్ల మెజారిటీతో అధికారంలోకి వస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ మెజారిటీ లేక చతికిలబడిందని సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఓ సారి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రథమస్థానం, బీజేపీకి ద్వితీయ స్థానం దక్కిందని, ఆ సమయంలో ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన పార్టీ రెండో స్థానం దక్కించుకుందని బీజేపీ సీనియర్ నేత వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అసలైన గెలుపు కాంగ్రెస్‌దేనని, ధార్మికపరమైన ఓటమి ప్రధాని మోదీకే దక్కిందని, కనుక కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకుంటే ఆయనకు కలిగే నష్టమేమిటని చిదంబరం ప్రశ్నించారు. ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని, వీవీపాట్లలో వచ్చే చీటీలను ఓటర్లకు ఇచ్చి మరొక పెట్టెలో వాటిని వేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించినట్లు ఆయన చెప్పారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

పెరంబూర్, జూన్ 7: స్థానిక వెస్ట్ మాంబళంలో భార్య పుట్టినరోజు సందర్భంగా ఇంటికి సీరియల్ సెట్ అమర్చుతున్న వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. బృందావన్ వీధికి చెందిన అగస్టిన్‌పాల్ (29) తన భార్య కీర్తి పుట్టినరోజు సందర్భంగా ఇంటిని విద్యుత్ లైట్లతో డెకరేషన్ చేస్తున్న సమయంలో హఠాత్తుగా షాక్‌కు గురై మృతిచెందాడు. కాగా, అగస్టిన్‌పాల్-కీర్తిల వివాహం జరిగి 8 నెలలో అవుతుండడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

పెరంబూర్, జూన్ 7: తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందారు. గురువారం సాయంత్రం సెయ్యారు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. పాపంతాంగల్ గ్రామానికి చెందిన మోనీషా(20), సిరువంజిపట్టు గ్రామానికి చెందిన రాజీ (40) వేర్వేరు ఘటనల్లో పిడుగుపాటుకు గురై మృతిచెందారు.

కారును ఢీకొన్న లారీ

ఇద్దరు చెన్నై వాసుల మృతి ● మరో ఐదుగురికి గాయాలు

అడయార్, జూన్ 7: దిండివనం సమీపంలోని మేల్‌మలయనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చెన్నై వాసులు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వలసరవాక్కంకు చెందిన ఏడుగురు కుటుంబ సభ్యులు ఒక కారులో మేల్‌మలయనూరులోని అంకాళమ్మన్ దర్శనానికి వెళ్ళారు. వీరంతా అమ్మవారిని దర్శనం చేసుకుని తిరిగి నగరానికి వస్తుండగా శుక్రవారం వేకువజామున తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారి, పటాలం ప్రాంతం వద్ద వెనక నుంచి వచ్చిన లారీ వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పార్వతి (77), సచిన్ (7) అక్కడికక్కడే మరణించగా, రమణి (53), శాంతి (50), వినోద్ (33), భువన (30)తో పాటు మూడేళ్ళ పాప తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాద వార్త తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

వృద్ధురాలికి లైంగిక వేధింపులు

● ఇద్దరి అరెస్టు

అడయార్, జూన్ 7: స్థానిక పాండిబజార్‌లోని ఒక ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తున్న 85 యేళ్ళ వృద్ధురాలిని ఐదుగురు యువకులు లైంగికంగా వేధించారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు.. ఆ పోకిరీల్లో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పాండిబజార్ ఆర్‌కే పురం అమ్మన్ వీధికి చెందిన 85 యేళ్ళ వృద్ధురాలు ప్రతి రోజూ ఉదయం ఇంటింటికి పాలప్యాకెట్లు వేస్తూ, వాటితో వచ్చే సంపాదనతో జీవిస్తున్నారు. ఈమె ప్రతి రోజూ స్థానికంగా ఉండే ఆలయ ప్రాంగణంలో నిదిస్తుంటారు. ఈ క్రమంలో టీ.నగర్‌కు చెందిన ఓ రాజకీయ నేతకు చెందిన హోటల్‌లో పనిచేసే రమేష్ (25), రామరాజం (31) సహా ఐదుగురు వ్యక్తులు ఆ వృద్ధురాలిని లైంగిక వేధింపులకు గురిచేశారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు.. ఆ యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించగా, రమేష్, రామరాజం దొరికారు. మిగిలిన ముగ్గురు పారిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఇద్దరు పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

కోవై మహిళ వద్ద ఆన్‌లైన్‌లో రూ.7 లక్షల మోసం

ప్యారీస్, జూన్ 7: ఆన్‌లైన్‌లో కోవై పోతనూరు ప్రాంతానికి చెందిన మహిళ వద్ద రూ.7 లక్షలు మోసం చేసి పరారైన వ్యక్తి కోసం సైబర్ క్రైం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. పార్ట్ టైం జాబ్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో అధిక ఆదాయం పొందవచ్చని పోతనూరుకు చెందిన బాలసుబ్రమణ్యం భార్య జయమ్మాళ్ సెల్‌ఫోన్‌కు కొన్ని రోజుల క్రితం మెసేజ్ వచ్చింది. మరుసటిరోజు సెల్‌ఫోన్‌లో జయమ్మాళ్‌ను సంప్రదించిన మెసేజ్ పంపిన వ్యక్తి తక్కువ డిపాజిట్‌తో అధిక ఆదాయం పొందవచ్చని నమ్మించి ఆమె నుంచి రూ.7,90,500 డిపాజిట్‌గా పొందినట్లు తెలిసింది. రోజులు గడుస్తున్నా పార్ట్ టైం జాబ్ పేరుతో ఎలాంటి ఆదాయం లేకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన జయమ్మాళ్ దీనిపై కోవై నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు ఆన్‌లైన్ మోసంపై దర్యాప్తు ప్రారంభించారు.

సూది మందు వికటించి విద్యార్థి మృతి

ప్యారీస్, జూన్ 7: సేలం జిల్లా ఆతూర్‌లో సూది మందు వికటించి 8వ తరగతి విద్యార్థి మృతి చెందడంపై పోలీసులు మెడికల్ షాప్ యజమానిని అరెస్ట్ చేశారు. ఆతూర్ ముల్లైవాడికి చెందిన జగదీష్ కుమారుడు కీర్తివాసన్ (13) ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నాడు. అనారోగ్యంతో బాధపడిన కీర్తివాసన్‌కు ఆ ప్రాంతంలోని మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందులు వాడారు. ఫార్మసీ చదువుకున్న ఆ మెడికల్ షాప్ నిర్వాహకుడు సెంథిల్‌కుమార్ మార్చి 21వ తేది కీర్తివాసన్‌కు ఇంజక్షన్ వేసి ఇంటికి పంపించారు. అయితే సూది మందు వికటించడంతో తల్లిదండ్రులు అతూర్ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అయితే చికిత్స ఫలించక కీర్తివాసన్ మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు, సెంథిల్‌కుమార్‌ను గురువారం అరెస్ట్ చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా సూది మందు వికటించడంతో బాలుడు మరణించినట్లు పోలీసులు తెలిపారు.

సీఐఎస్‌ఎఫ్ జవాను ఆత్మహత్య


పెరంబూర్, జూన్ 7: అరక్కోణం సమీపం తక్కోలంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగం (సీఐఎస్ఎఫ్) జవాను ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన నాగేశ్వరరావు (39) వెంకటలక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నాగేశ్వరావు రాణిపేట జిల్లా తక్కోలంలో ఉన్న సీఐఎస్ఎఫ్ కేంద్రంలో పనిచేస్తున్నాడు. ఆయన అక్కడే ఉన్న క్వార్టర్స్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈనేపథ్యంలో, వేసవి సెలవులు కావడంతో వెంకటలక్ష్మి పిల్లలను తీసుకొని ఆంధ్రకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న నాగేశ్వరరావు గురువారం రాత్రి భార్యకు ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడుతుండగా హఠాత్తుగా ఆయన ఫోన్ కట్ చేయడంతో పాటు స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో, అనుమానించిన వెంకటలక్ష్మి, చుట్టుపక్కల వారిని ఫోన్ సంప్రదించింది. వారు వెళ్లి చూడగా గదిలో నాగేశ్వరరావు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, నాగేశ్వరరావు ఆత్మహత్యకు కుటుంబ సమస్యలే కారణమా, మరేదైనా ఉందా అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

చెన్నై నగరంలో గాలివాన

35 విమానాల రాకపోకలకు అంతరాయం

అడయార్, జూన్ 7: చెన్నై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో గురువారం రాత్రి కురిసిన గాలివానకు పలు విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం కలిగింది. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రవేశంతో వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలతో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, మదురై, తిరుచ్చి, కోలికోడ్, గోవా, హైదరాబాద్, కౌలాలంపూర్, సింగపూర్ తదితర ప్రాంతాల నుంచి చెన్నై వచ్చిన పలు విమానాలు ల్యాండ్ కాలేకపోయాయి. దీంతో కొన్ని నిమిషాల పాటు ఆకాశంలో చక్కర్లు కొట్టి, వాతావరణం అనుకూలించిన తరువాత ల్యాండ్ అయ్యాయి. ఇదేవిధంగా చెన్నై నుంచి అబుదాబి, దుబాయ్, సింగపూర్, కౌలాలంపూర్, ఢిల్లీ, ముంబై, కొచ్చిన్, కన్నూరు, తిరువనంతపురం, కోలికోడ్, ఇండోర్ తదిర ప్రాంతాలకు వెళ్ళాల్సిన 18 విమానాలు రెండు గంటల పాటు ఆలస్యంగా బయలుదేరి వెళ్ళాయి.

తరుణి

ఆత్మవిశ్వాసానికి నిదర్శనం..
సమాజసేవలో 'జయ' కేతనం

● జయా రామకృష్ణన్



ట్రస్ట్ ఆధ్వర్యంలోని బాలవాడీ



ఆర్థిక స్వావలంబన పొందిన మహిళలతో....

సమాజసేవకి స్త్రీ, పురుష వ్యత్యాసం లేదు. కులమత భేదం లేదు. మంచి రోజులు లేవు. వయోభేదం అంతకంటే లేదు. కావలసినది ముఖ్యంగా మంచిమనసు, విశాల దృక్పథం, సంకల్ప బలం వుంటే అన్నిటినీ అధిగమించి లక్ష్యాన్ని సాధించవచ్చు. ఎనిమిది పదులు దాటిన వయసులో కూడా ఇంకా సమాజసేవకు అంకితమై, మహిళా సాధికారతకు, స్వావలంబనకు చేయూతనిస్తున్న ఓ మహిళ. మానవసేవే మాధవసేవగా భావించి అవిరళం, అకుంఠితంగా కృషిచేస్తున్న జయా రామకృష్ణన్ సమాజసేవా ప్రస్థానమిది....

- వేళచ్చేరి

జయ పుట్టి పెరిగింది తమిళనాడులోకి కోయంబత్తూర్‌లో. విద్యాభ్యాసం కూడా అక్కడే జరిగింది. 'నిర్మలా కాలేజ్' నుంచి బీఎస్సీ డిగ్రీ పొందారు.

అభిరుచులు... : శాస్త్రీయ సంగీతంపై మక్కువే కాకుండా అందులో ప్రావీణ్యం సాధించారు జయ. చేతి పనులు, ఎంబ్రాయిడరీ మొదలైన వాటిల్లో నేర్పు కూడా ఉంది. ఇప్పటికీ వాటిని కొనసాగించడం ఆ హస్తకళల పట్ల ఆమెకున్న ఆసక్తికి నిదర్శనం

సమాజసేవకు ప్రేరణ ... : సమాజసేవపై ఆసక్తి వారసత్వంగానో, బాల్యం నుండో జయకు అబ్బలేదు. ఒకానొక సంఘటన సమాజసేవకు ఆమెను ప్రేరేపించింది. భర్త ఉద్యోగరీత్యా త్రిచీలో ఉండగా, కొందరు స్త్రీలతో కలసి జయ ఒక దీపావళి నాడు మిఠాయిలు పంచేటందులకు అంధ బాలికల సెంటర్‌కు వెళ్లారు. అక్కడ వారు వైరు బ్యాగులను అల్లడం, స్పర్శతో డబ్బును గుర్తించడం మొదలైనవి చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. వారి పట్టుదల, కృషికి ఆనందించిన ఆమె ప్రత్యేక ప్రతిభావంతులకు తన వంతుగా ఏదైనా సాయం చెయ్యాలని భావించారు. ఆ సంఘటన ఆమెలో సమాజసేవ పట్ల ప్రేరణ కలిగించింది. త్రిచీలో ఉన్న కాలం అంతా సమాజసేవకే అంకితం చేశారు. భర్త ఉద్యోగం రీత్యా ఢిల్లీ వెళ్లినా జయ సామాజిక సేవా కార్యక్రమాలు అక్కడ కూడా కొనసాగించారు. కుష్ఠురోగులకు వీల్ ఛైర్స్ ఇవ్వడం, దుప్పట్లు పంచడం మొదలైన సేవా కార్యక్రమాలు చేశారు. కొన్నేళ్ల తరువాత చెన్నై వచ్చి స్థిరపడ్డాక ఆమె సమాజసేవా కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

సమాజసేవలో జయ... : 1996వ సంవత్సరంలో ఆర్థికంగా వెనుకబడిన స్త్రీలు, పిల్లల కోసం జయ 'ఆరుద్ర ఛారిటబుల్ ట్రస్ట్'కి శ్రీకారం చుట్టారు. చెన్నైలోని నందనం ప్రాంతంలోని మురికివాడలో ట్రస్ట్ కార్యక్రమాలకు నాందీ పలికారు. చిన్నారులకు క్రచ్, మద్యపాన వ్యసనపరులకు దాని నుండి విముక్తి కలిగించే దిశగా కృషి, నిరక్షరాస్యులైన నిరుపేద మహిళలకు ఆర్థిక స్వావలంబన, పదో తరగతిలో ఉత్తీర్ణులైన బాలికలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ విజయం ఆమెలో మరింత ఉత్సాహాన్ని నింపింది. ట్రస్ట్ ద్వారా మూడు గ్రామాలను దత్తత చేసుకున్నారు. పెరుంబాక్కం పంచాయతీలోని పసుంపొన్‌నగర్, ఇందిరా నగర్, కలైంజర్ నగర్‌లో చిన్నారుల కోసం క్రచ్‌లను నిర్వహించారు. వంద మంది పైగా పిల్లలకు ఉచితంగా భోజనం అందించారు. చెన్నైలోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారంతో వయోజన విద్యాకేంద్రాన్ని కొంతకాలం నిర్వహించారు. రోటరీక్లబ్ సహకారంతో శిక్షణ పొందిన టీచర్‌తో ఆ గ్రామాల్లోని వారికి శిక్షణ ఇప్పించారు.

> "ప్రతి మహిళా స్వశక్తితో ఆర్థిక స్వావలంబన పొందేందుకు కృషి చెయ్యాలి. కష్టపడితే సాధించలేనిదంటూ ఉండదు"

మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించేందుకు ఫినాయిల్ తయారు చేయడం, బట్టతో సంచులు, పేపర్ బ్యాగులు తయారుచేయడం, ఎంబ్రాయిడరీ తరగతులు, కుట్టు క్లాసులు, కంప్యూటర్ తరగతులు, కొవ్వొత్తుల తయారీ, జామ్, జ్యూస్‌ల తయారీ మొదలైన ఎన్నో విషయాల్లో శిక్షణ ఇప్పించారు జయ. చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించి వారికి కోచింగ్ తరగతులను నిర్వహించారు. చదువులో ముందున్న విద్యార్థుల ఉన్నత విద్యకు ధన సాయం చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. ఈ ట్రస్ట్ సాయంతో ఎంతోమంది విద్యార్థులు పై చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని జయ సంతోషంగా తెలిపారు. కొంతమంది మహిళలను మాంటిస్సోరీ ట్రైనింగ్‌కి పంపి వారు ఉపాధ్యాయులుగా ఎదిగేందుకు కృషిచేశారు జయ. మురికివాడల్లోని వారికి ఉచితంగా కంటి పరీక్షలు, కాన్సర్ రోగ నిర్ధారణ, మధుమేహ పరీక్షలు మొదలైనవి చేయించి వారికి ఆరోగ్యం, పరిశుభ్రత తదితర విషయాల్లో అవగాహన కలిగించారు. ప్రస్తుతం ట్రస్ట్ ద్వారా పదకొండు మంది స్త్రీలు ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలబడి ఆర్థిక స్వావలంబన అందిపుచ్చుకున్నారు. ట్రస్ట్ ద్వారా కుట్టు పనిలో శిక్షణ పొందిన 25 మంది స్త్రీలు నైటీలు, లంగాలు కుట్టి ఆదాయం పొందుతున్నారు. ట్రస్ట్ ప్రస్తుతం రెండు బాలవాడీలను నిర్వహిస్తున్నది. అక్కడ పిల్లల కోసం అనుభవజ్ఞులైన ఇద్దరు ఉపాధ్యాయులు, ఆయా పనిచేస్తున్నారు.

ఎనభై ఏళ్ల పైబడిన వయసులో కూడా ఎంతో ఉత్సాహంగా వారానికి రెండు సార్లు ఆ గ్రామాలకు వెళ్లి అక్కడి కార్యక్రమాలను పర్యవేక్షించి, బియ్యం, పప్పులు, కాయగూరలు అందజేసి రావడం ఆమె సమాజసేవకు నిదర్శనం. జయ తన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "ఒకానొక సమయంలో తన సమాజసేవా కార్యక్రమాలకు అవసరమై తన తల్లి ఇచ్చిన 30 సవర్ల బంగారాన్ని కూడా వెచ్చించాల్సి వచ్చిందని, ఆ బంగారం అలా సద్వినియోగం అయినందుకు తనకెంతో సంతృప్తి, సంతోషం కలిగిందని" అన్నారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు కూడా ట్రస్ట్ ద్వారా జయ సేవలు అందిస్తున్నారు. వారికి పేపర్ కప్స్, పేపర్ బ్యాగ్స్ మొదలైనవి తయారుచేయడం వంటి వాటిల్లో శిక్షణ యిప్పించి వారిలో ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నారు.

కుటుంబం: భర్త రామకృష్ణన్.విశ్రాంత ఉద్యోగి. అయినా అవిశ్రాంతంగా భార్య సమాజసేవకు తన సహాయ సహకారాలతో పాటు ప్రోత్సాహాన్నిస్తూ అండదండగా నిలుస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. ఒక కుమార్తె తల్లి బాటలోనే నడుస్తూ సామాజిక సేవ కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నది.



భర్త రామకృష్ణన్‌తో...

చిత్రజ్యోతి

హీరోయిన్ల మధ్య పోటీ అవసరం

● తమన్నా

ఇతర రంగాల్లో పోటీ ఉన్నట్టుగానే చిత్రపరిశ్రమలో హీరోయిన్ల మధ్య పోటీ అవసరమని అగ్రనటి తమన్నా అభిప్రాయపడ్డారు. గత యేడాది సూపర్‌స్టార్ రజినీకాంత్ 'జైలర్' చిత్రంలో ప్రత్యేక గీతంలో నర్తించిన తమన్నా... ఈ యేడాది సుందర్ సి దర్శకత్వం వహించి హీరోగా నటించిన 'అరణ్మనై-4' చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఇందులో నటించిన మరో హీరోయిన్ రాశీఖన్నాతో ఆమెకు పోటీ నెలకొందనే వార్తలు వచ్చాయి. దీనిపై తమన్నా స్పందిస్తూ, 'ఒక చిత్రంలో ఇద్దరు హీరోయిన్లుంటే ఒకరితో ఒకరిని పోల్చి మాట్లాడటం సహజం. కొందరు ఇద్దరు హీరోయిన్ల మధ్య పోటీ ఉందంటారు. కానీ, నా విషయానికి వస్తే, హీరోయిన్ల మధ్య పోటీ ఉండటం ఎంతో అవసరం. అయితే, ఈ పోటీ ఎంతో ఆరోగ్యకరంగా ఉండాలి. సినిమా పరిశ్రమలో పోటీ ఉన్నప్పటికీ మనం.. మనంలాగే నటిస్తే చాలు. 'అరణ్మనై-4' చిత్రంలో నేను, రాశీఖన్నా ఒక పాటకు కలిసి డ్యాన్స్ చేశాం. అపుడు ఒకరికి ఒకరు అండగా నిలిచాం. అందువల్ల హీరోయిన్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండటం ఎంతో మంచిది' అని అభిప్రాయపడ్డారు.



ఔత్సాహికులకు సువర్ణావకాశం

బిగ్ షార్ట్స్ సీజన్-3

చిత్రపరిశ్రమలో అవకాశాల కోసం ఎదురు చూసే ఔత్సాహికుల కోసం మూవీబఫ్ - టర్మరిక్ సంయుక్తంగా ఒక వేదిక కల్పించనున్నాయి. ఇలాంటి వారికోసం 'బిగ్ షార్ట్స్' పేరుతో సీజన్-3 కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి. గతంలో 'ఫస్ట్ క్లాప్' పేరుతో దీన్ని నిర్వహించారు. ఇపుడు పేరుమార్చి... త్వరలో ఈ మూడో సీజన్‌ను ప్రారంభించనున్నారు. సినిమాల్లో అవకాశాల కోసం ఎదురు చూసే ఔత్సాహికులు చేయవలసిందల్లా ఒక్కటే... 'టెల్ ఏ స్టోరీ ఇన్ 3 మినిట్స్' పేరుతో ఒక షార్ట్ తీసి ఈ ప్లాట్‌ఫాం నిర్వాహకులకు పంపించాల్సి ఉంటుంది. 2017లో తొలిసారి ప్రారంభించిన ఈ సీజన్‌కు వచ్చి ఎంట్రీలను తమిళనాడులోనే 40 పట్టణాల్లో 500 స్క్రీన్‌లలో ప్రదర్శించారు. ఈ యేడాది కూడా వచ్చే ఎంట్రీల్లో ఉత్తమమైనవాటిని ఎంపిక చేసి స్క్రీనింగ్ చేస్తారు. ఈ సీజన్‌కు జ్యూరీ సభ్యులుగా కోలీవుడ్‌లో పేరొందిన దర్శకులు కార్తీక్ సుబ్బరాజ్, ఎస్‌యు అరుణ్ కుమార్, హలీదా షమీమ్, ఎడిటర్లు శ్రీకర్ ప్రసాద్, సెల్వ ఆర్‌కే, ఫిలోమిన్ రాజ్, సినిమాటోగ్రాఫర్ తేని ఈశ్వర్, మూవీ క్రిటిక్స్ శ్రీధర్ పిళ్ళై, నటుడు ప్రదీప్ రంగనాథన్ (గెస్ట్) వ్యవహరించనున్నారు. ఈ సీజన్‌లో టాప్ కంటెస్టెంట్స్‌గా నిలిచే విజేతలకు రూ.5, రూ.3, రూ.2 లక్షలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామని నిర్వాహకులు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



రజనీ దంపతులతో రాధిక, శరత్ కుమార్, వరలక్ష్మి

వరలక్ష్మి వివాహానికి సూపర్‌స్టార్‌కు ఆహ్వానం

ప్రముఖ సినీ నటి వరలక్ష్మి ముంబైకు చెందిన వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను వివాహమాడనున్నారు. వీరిద్దరికీ ఇప్పటికే నిశ్చితార్థం జరగ్గా త్వరలో వివాహం జరుగనుంది. అయితే, వివాహ తేదీ ఇంకా అధికారికంగా వెల్లడించకపోయినప్పటికీ.. ఆహ్వాన పత్రికలను మాత్రం రాధికా శరత్ కుమార్ దంపతులు అందరికీ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల హిమాలయాల్లో తన ఆధ్యాత్మిక యాత్ర పూర్తి చేసుకుని నగరానికి వచ్చిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను కలిసిన పెళ్లి కుమార్తె వరలక్ష్మి, రాధిక శరత్ కుమార్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. వీరి వివాహం ముంబైలో నిర్వహించి, రిసెప్షన్ మాత్రం నగరంలోని హోటల్‌లో ఏర్పాటు చేయాలనే ఆలోచనలో రాధిక దంపతులు ఉన్నట్టు సమాచారం. కాగా, 'పోడా పోడి' చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన వరలక్ష్మి... ఆ తర్వాత 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'క్రాక్', 'నాంది', 'వీరసింహారెడ్డి' వంటి చిత్రాల్లో పవర్‌ఫుల్ పాత్రలు పోషించి ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్రవేసుకున్నారు.



సునైనా

పెళ్ళిపీటలెక్కనున్న కోలీవుడ్ హీరోయిన్!

కోలీవుడ్ హీరోయిన్ సునైనా పెళ్లి పీటలెక్కనున్నారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తన నిశ్చితార్థం ఫొటోను విడుదల చేశారు. తమిళంలో 'కాదలిల్ విళుందేన్' అనే చిత్రం ద్వారా పరిచయమైన సునైనా... ఆ తర్వాత 'మాసిలామణి', 'తిరుత్తణి', 'వంశం', 'నీర్‌పరవై', 'తెరి', 'కవలై వేండాం', 'తొండన్', 'లత్తి' వంటి అనేక చిత్రాల్లో నటించారు. గత యేడాది రెజీనా అనే చిత్రంలో ఆమె సోలో హీరోయిన్‌గా నటించారు. ఇప్పటివరకు బ్యాచిలర్‌గానే ఉన్న 35 యేళ్ళ సునైనా తన పెళ్ళి వార్తలు మీడియాలో వస్తే వాటిని ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో తన పెళ్ళిపై ఆమె క్లారిటీ ఇచ్చారు. సోషల్ మీడియాలో 'ఓ వ్యక్తి చేతిలో తన చేయి ఉన్న ఫొటోను షేర్ చేసి, వధూవరులు, వివాహం తదితర విషయాలను తర్వాత వెల్లడిస్తాం' అని రాసుకొచ్చారు. దీంతో సునైనా పెళ్ళి పీటలెక్కడం ఖాయమని తేలిపోయింది.

మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి రజనీకి ఆహ్వానం



మోదీ, చంద్రబాబుతో రజనీ (ఫైల్‌ఫొటో)

అడయార్, జూన్ 7: మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనమంటూ తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆహ్వానం అందింది. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఈ నెల 9న మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ ప్రమాణ స్వీకారోత్సవానికి దేశవిదేశాలకు చెందిన ప్రముఖులు అనేక మందిని ఆహ్వానిస్తున్నారు. ఆ మేరకు ఢిల్లీలో జరిగే ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని పీఎంవో నుంచి రజనీకాంత్‌కు ఆహ్వానం వచ్చినట్టు సమాచారం. అలాగే, ఈ నెల 12 న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ కార్యక్రమానికి రజనీకాంత్‌కు ఆహ్వానం పంపించినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో ఢిల్లీ, అమరావతిలో జరిగే మోదీ, చంద్రబాబుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు రజనీకాంత్ హాజరుకానున్నారు.

ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ కీలక ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

అడయార్, జూన్ 7: అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ (అన్నా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ ఫౌండేషన్ (ఏఐసీ - ఇంక్యుబేటర్)తో ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ) ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ వీఎల్ ఇందిరా దత్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్, సీఈవో డాక్టర్. పి.ఉమామహేశ్వరి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇందిరా దత్ మాట్లాడుతూ, ఏఐసీ అన్నా ఇంక్యుబేటర్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మేల్‌మలయనూరు ఆలయంలో

నేత్రపర్వంగా ఊంజల్ ఉత్సవాలు



సర్వాలంకరణశోభితంగా వేంచేసిన అంకాళపరమేశ్వరీ అమ్మవారు. ఊంజల్ ఉత్సవాలను తిలకిస్తున్న భక్తులు

చెన్నై, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి వైకాశి అమావాస్య ఊంజల్ ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ వేడుకలను పురస్కరించుకుని గురువారం వేకువజామునే గర్భాలయంలోని అమ్మవారికి, పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వర్ణకవచాలతో అలంకరించి మహాదీపారాధన చేశారు. ఆ తర్వాత ఉత్సవమూర్తి అయిన అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. ఆలయ అంతర ప్రకారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10.30 గంటలకు మంగళవాయిద్యాల నడుమల ఉత్తర ద్వారం మీదుగా అమ్మవారు ఊంజల్ మండపానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేల సంఖ్యలో భక్తులు చేరారు. తర్వాత ఆలయ పూజారులు అమ్మవారిని కీర్తిస్తూ జోలపాట పాడారు. ఊంజల్ ఉత్సవం అనంతరం అమ్మవారికి దీపారాధన చేశారు. ఆ తర్వాత రాత్రి 11.45 గంటలకు ఊంజల్ మండపం నుంచి అమ్మవారు ఆలయానికి బయలుదేరారు. ఈ వేడుకల్లో విల్లుపురం జిల్లా కలెక్టర్ పళని, విల్లుపురం, కడలూరు, సేలం, వేలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెన్నై తదితర జిల్లాలతో పాటు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాదిమంది భక్తులు జోరున వర్షం కురుస్తున్నా పట్టించుకోకుండా అమ్మవారిని దర్శించారు.

ప్రజల కోసం పోరాడే నేత రాహుల్

టీఎన్‌సీసీ ఎస్సీ విభాగం నేత రంజన్‌కుమార్



ఢిల్లీలో మల్లిఖార్జున ఖర్గేను కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని అందజేస్తున్న రంజన్ కుమార్. చిత్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ కూడా ఉన్నారు.

ప్యారీస్, జూన్ 7 : ప్రజల కోసం అలుపెరుగక పోరాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీని యూపీఏ నేతగా ఎంపిక చేయాలని ఏఐసీసీని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో జరుగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళిన రంజన్‌కుమార్ బీజేపీ ప్రభుత్వాన్ని మైనారిటీ ప్రభుత్వంగా మార్చేలా బలమైన ఇండియా కూటమిని ఏర్పాటు చేసి యూపీఏ కూటమి విజయానికి కృషి చేసిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేని కలిసి ఆయనకు అంబేడ్కర్ విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖర్గేకు సమర్పించిన లేఖలో తమిళనాడులో విద్యార్థులను బలిగొంటున్న నీట్ రద్దు చేసేలా పార్లమెంట్‌లో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు.



చెన్నై సచివాలయంలో కొబ్బరి రైతులకోసం ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతులను మంత్రులు దామో అన్బరసన్, సామినాథన్‌కు అందజేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం

చెన్నై క్యాంపు కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని సత్కరిస్తున్న సీనియర్ నటుడు త్యాగరాజన్, ఆయన తనయుడు హీరో ప్రశాంత్

